అణగారిన జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం 17 ఏప్రిల్ 2023

శిశువు విక్రయం

- ఐసీపీఎస్ సిబ్బందికి అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

శిశువును అక్రమంగా దత్తత ఇచ్చారని ఐసీపీఎస్ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా.. పోలీసులు విచారణ చేపట్టారు. గుర్తుతెలియని నిజామాబాద్ దంపతులకు తల్లి విక్రయించగా ఆదివారం పోలీసులు శిశువును గుర్తించి వారి నుంచి తీసుకొని పాప తల్లి సమక్షంలో ఐసీపీఎస్ సిబ్బందికి అందజేసినట్టు ఎస్సై అనిల్ తెలిపారు.



శిశువును సిబ్బందికి అప్పగిస్తున్న పోలీసులు

నివురుగప్పిన నిప్పులా కరోనా..

- తాజాగా ఒక కేసు నమోదు

నవతెలంగాణ-నిజామాబాద్

కరోనా కేసులు పెరుగుతున్నాయని, జాగ్రత్తలు తీసుకోవాలని గత కొన్ని రోజులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో తాజాగా నిజామాబాద్‌లో ఒక పాజిటివ్ కేసు నమోదు అయింది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం 46 మందికి కరోనా పరీక్షలు చేపట్టగా, అందులో ఒకరికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కోవిడ్ నిబంధనలు పాటించాలని, బయటకు వెళ్లినప్పుడు మాస్క్ ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.



రాత్రి వేళ వరి కోతలు కోస్తున్న యంత్రం

పర్మినెంట్‌పై సర్కారు మౌనం..

సమ్మె బాటలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

- ఏప్రిల్ 11తో నాలుగేండ్లు పూర్తి
- ఉమ్మడి జిల్లాలో 809 మంది విధులు
- ఔట్‌సోర్సింగ్‌లో మరో 81 మంది
- రెండు నెలల క్రితం వివరాలు కోరిన సర్కారు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని కొండంత ఆశతో నాలుగేండ్లుగా ఎదురుచూసిన పంచాయతీ కార్యదర్శులు సమ్మెబాటలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్ర సర్కారు నుంచి స్పందన లేకపోవడంతో ఈ నెల 28వ తేదీ నుంచి సమ్మెలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 809 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. వీరికి అదనంగా మరో 81 మంది ఔట్‌సోర్సింగ్‌లో పంచాయతీ కార్య దర్శులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా తమను సర్కారు రెగ్యులర్ చేస్తుందని గంపెడాశలతో ఉన్నారు. అయితే రెండు నెలల క్రితం రాష్ట్ర సర్కారు పంచాయతీ కార్యదర్శులకు సంబంధిం చిన వివరాలు కోరింది. కానీ నాటి నుంచి స్పందన లేదు.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో 2019లో రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేసింది. నాలుగేండ్ల ఒప్పందంపై 2019లో ఏప్రిల్ 11వ తేదీ నుంచి విధుల్లో చేరారు. నాలుగేండ్ల ప్రొబేషన్ కాల వ్యవధితో విధుల్లోకి తీసుకుంది. ఈ కాలవ్యవధిలో ఎలాంటి అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నా, పనితీరు సరిగా లేకపోయినా రెగ్యులర్ చేయబోమని ముందుగానే ఒప్పందంలో పేర్కొంది. ఇక నాటి నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ ఉద్యోగం రెగ్యులర్ చేసుకోవాలన్న పట్టుదలతో పని చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిన అన్ని పనులను చక్కబెట్టారు. చివరకు ఉపాధి హామీచట్టంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పనిని సైతం కార్యదర్శులకు అప్పగించింది. ఇక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కార్యదర్శులు ముందు వరుసలో ఉన్నారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 391 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులున్నారు. అలాగే 30 మంది ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్నారు. ఇక కామారెడ్డిలో మొత్తం 418 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులుండగా.. మరో 51 మంది ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రొబేషన్ కాలం ముగియడంతో వీరంతా తమను పర్మినెంట్ చేయాలని కోరుతున్నారు. పైగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా రెండు నెలలుగా సర్కారు వేతనాలు సైతం చెల్లించలేదు. అయితే రెండు రోజుల క్రితం ఒక నెల వేతనం అందజేసింది. కానీ ఔట్‌సోర్సింగ్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు జనవరి నుంచి వేతనాలు లేవు.



రెండు నెలల క్రితం వివరాలు కోరిన సర్కారు..

జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు సంబంధించి రెండు నెలల క్రితం రాష్ట్ర సర్కారు అన్ని జిల్లా పంచాయతీ కార్యాలయాల నుంచి వివరాలు కోరింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం పంచాయతీ కార్యదర్శులు ఎంతమంది పనిచేస్తున్నారు? ఏయే పంచాయతీల్లో విధుల్లో ఉన్నారు. అందులో ఏప్రిల్ వరకు ఎంతమంది కార్యదర్శుల నాలుగేండ్ల కాలం పూర్తవుతుంది? మే వరకు ఎంతమంది సభ్యులు నాలుగేండ్లు పూర్తి చేసుకుంటారు? అని వివరాలు కోరింది. అయితే రెండు నెలలు పూర్తయినా సర్కారు నుంచి స్పందన లేదు.

తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం..

రాష్ట్ర సర్కారుతో పంచాయతీ కార్యదర్శులు తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. నాలుగేండ్లుగా నిరీక్షించిన ప్పటికీ.. సర్కారు నుంచి స్పందనలేక పోవడంతో సమ్మె చేపట్టేం దుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఆయా మండలాల్లో పరిధిలో ఎంపీడీవోలకు సమ్మె నోటీసులు అందజేస్తున్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి సమ్మె చేపడతామని స్పష్టం చేస్తున్నారు. పైగా ఈ యేడాది ఎన్నికల యేడాది కావడం, బీఆర్ఎస్ జాతీయస్థాయిలో పోటీకి సిద్ధమవుతుండటంతో అదే తరుణమని కార్యదర్శులు పోరుకు సిద్ధమవుతున్నారు.

రాత్రిళ్లు.. వరి కోతలు

- కోతలు షురూ కావడంతో కోత యంత్రాలకు డిమాండ్
- రాత్రి వేళ కోతలతో రైతులకు నష్టం

నవతెలంగాణ-నవీపేట్

ప్రస్తుతం వరి కోతలు జోరుగా కొనసాగుతండటంతో కోత యంత్రాలకు ఫుల్లు డిమాండ్ నెలకొంది. వరి కోత మిషిన్‌లు సరిపడా లేక.. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రాత్రి వేళ సైతం కోతలు కొనసాగిస్తున్నారు.

వరి పైర్లు కోత కొచ్చి పది రోజులకు పైగా కావస్తున్న వరి కోత యంత్రాల కొరత ఉండడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. వర్ష సూచనలు, వాతావరణ మార్పులతో అకాల వర్షాలు కురుస్తాయేమోనని రైతుల్లో ఆందోళన తీవ్రమౌతుంది. ప్రతి మండలంలో వరి పైరు కోతల కోసం టైర్ మిషన్లు, చైన్ మిషన్లు చాలా తక్కువ సంఖ్యలో ఉండడంతో రాత్రిపూట సైతం వరి కోతలు కొనసాగిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో పాటు కరీంనగర్ జిల్లా నుండి కోత మిషన్లు ఎక్కువ సంఖ్యలో వస్తుంటాయి. కానీ ఈ ఏడు నిజామాబాద్ జిల్లాలో నార్లు వేసేటప్పుడు చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో నారు పెరుగక కోతలు 15 రోజులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీంతో 15 రోజులు కోతలు ఆలస్యం కావడం అదే సమయంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కరీంనగర్ ప్రాంతాలలో సైతం కోతలు మొదలు కావడంతో కోత మిషన్లు ఆ ప్రాంతాల్లోనే పనిచేస్తున్నాయి. దీంతో ప్రతి ఏడాది కంటే ఈ ఏడు కేవలం 60 శాతం కోత మిషన్లు మాత్రమే ఉండడంతో డిమాండ్ పెరిగింది. దీంతో కోతలు రాత్రింబవళ్లు చేయాల్సి వస్తుంది.

రాత్రిపూట వరి కోత సరిగ్గా జరగకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇదే అదునుగా చూసుకొని కోత మిషన్ల యజమానులు అమాంతం రేట్లు పెంచడంతో రైతులపై మరింత భారం పడుతుంది. కాగా టైర్ మిషిన్ ఎకరానికి రూ. 2300 తీసుకుంటుండగా, చైన్ మిషిన్‌కు రూ.2500 నుంచి 2700 తీసుకుంటున్నారు. అయితే రాత్రి వేళ కోతలు కోస్తుండటంతో రైతులకు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. కోత కోసే సమయంలో గట్టువైపున సరిగ్గా కోత కోయకపోవడంతో తర్వాత రోజు మరో కూలీని పెట్టుకొని కోతలు కోయించాల్సి వస్తుంది. దీంతో రాత్రి వేళ వరి కోతలు సరిగ్గా చేపట్టలేకపోతున్నా. తప్పని పరిస్థితిల్లో చేపట్టాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూల్యాంకనానికి డుమ్మా

- 138 మంది ఉపాధ్యాయులకు నోటీసులు



నవతెలంగాణ-కంఠేశ్వర్

పదో తరగతి మూల్యాంకనం డ్యూటీకి పలువురు ఉపాధ్యాయులు గైర్హాజరు అవుతున్నారు. విధులు కేటాయించినా డుమ్మా కొట్టిన 138 మంది ఉపాధ్యాయులకు డీఈవో దుర్గాప్రసాద్ నోటీసులు జారీ చేశారు. నోటీసులపై సదరు ఉపాధ్యాయులు వివరణ ఇవ్వాలని, లేదంటే సస్పెన్షన్ వేటు వేస్తామన్నారు. పదవ తరగతి పరీక్షల మూల్యాంకన సందర్భంగా నియమించబడ్డ ఉపాధ్యాయులు తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ముందస్తుగా ఈనెల 13వ తేదీన ఆదేశించారు. అయినా కొంతమంది ఉపాధ్యాయులు సుమారు 138కు పైగా ఉండడం రాకపోవడం ప్రశ్నార్థకం. పదవ తరగతి పరీక్షల మూల్యాంకన సందర్భంగా ఎంతమంది అయితే రిపోర్ట్ చేశారో వారు తప్పనిసరిగా రావాలి లేనియెడల వ్రాతపూర్వకంగా లెటర్ రాసి ఇవ్వాలి అని జిల్లా విద్యాశాఖ అధికారి తెలియజేశారు. అయినప్పటికీ విద్యాశాఖ అధికారి చెప్పిన విధంగా 138 ఉపాధ్యాయులు మూల్యాంకనకు రాకపోవడం అలాగే నిజామాబాద్ జిల్లాకి ఉన్నత అధికారిగా వ్యవహరించిన జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి జెడి నిజామాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఉపాధ్యాయులు రాకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధ్యాయ సంఘాల అండదండలతో పలువురు మూల్యాంకనానికి రావట్లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాల పరీక్ష ప్రశాంతం

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డీఈవో, ఎంఈవో

నవతెలంగాణ-సదాశివనగర్

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్‌ల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్టు మండలంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు మొత్తం 556 మంది విద్యార్థులకు గాను 462 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 472 మంది విద్యార్థులకు గాను 388 మంది పరీక్ష రాసినట్టు తెలిపారు. కాగా పరీక్షా కేంద్రాన్ని డీఈవో రాజు, ఎంఈవో యూసెఫ్ పరిశీలించారు. పరీక్ష ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాలల్లో మోడల్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించినట్టు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు 2008 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 7వ తరగతికి 727 మంది, 8వ తరగతికి 534 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు తెలిపారు. అదే విధంగా 9వ తరగతిలో ప్రవేశాలకు 244 మంది, 10వ తరగతికి 102 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు తెలిపారు. జిల్లాలో పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్టు తెలిపారు.

సీపీఎస్ రద్దు చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి/పిట్లం

నూతన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు చేయాలని సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఆదివారం ర్యాలీ చేపట్టారు. నూతన పెన్షన్ స్కీం రద్దు కోసం రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోరాటాలు దశల వారీగా చేపడుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని ఏకైక డిమాండ్‌తో తమ పోరాటాన్ని ఉధృతం చేస్తున్నామని తెలిపారు. 30 సంవత్సరాలుగా సేవ అనంతరం ప్రతి ఉద్యోగికి పెన్షన్ సౌకర్యము జనవరి 2004కు ముందు కేంద్రంలో, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో సెప్టెంబర్ 2004 లో ఐపీఎస్‌ను తీసుకువచ్చారని అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల సొమ్మును, ప్రభుత్వాల సొమ్మును ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు కార్పొరేట్ పెట్టుబడి దారుల చేతిలో పెట్టి అటు ప్రభుత్వాల సొమ్మును ఇటు ఉద్యోగుల సొమ్మును స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టి ఉద్యోగులకు నష్టం చేస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు రిటైర్ అయిన ఉద్యోగికి వచ్చే పెన్షన్ తెలంగాణ ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్ స్కీం కంటే తక్కువే అని మండి పడ్డారు. 309 ఆర్టికల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ అనేది రాష్ట్ర ప్రభుత్వ పరిధి లోనిదేనని అన్నారు. సీపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

పిట్లం నుంచి పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ మండల అధ్యక్షులు రూప్‌సింగ్ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగుల మెడమీద కత్తి అని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ , ఉపాధ్యక్షులు ప్రియాంక, సునీత, ప్రేమల, సంగమేశ్వర్ , మల్లికార్జున్, నాగభూషణం , రవికుమార్ , మల్లయ్య , శ్రీధర్ రెడ్డి , శ్రీనివాస్ , రమేష్ , దేవి సింగ్ , శరణప్ప , కృష్ణంరాజు , ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపట్టిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ఇండ్లు, వ్యాపారాలు కోల్పోతున్నాం

- ఎంపీ అరవింద్‌ను కలిసిన బ్రౌన్ హైవే విస్తరణ బాధితులు



ఎంపీ అరవింద్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న బ్రౌన్ హైవే విస్తరణతో ఇండ్లు, భవనాలు, వ్యాపారాలు, ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు కోల్పోతున్నామని పలువురు బాధితులు వాపోయారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన పలువురు బాధితులు బిజెపి నాయకులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డితో కలిసి ఎంపీ అరవింద్‌ను ఆదివారం ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బ్రౌన్ హైవే కేంద్ర ప్రభుత్వం పరిధిలోనిది అయినందున సంబంధిత మంత్రితో మాట్లాడి తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

వివరాలు మెయిన్‌లో..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- రాంగ్‌రూట్‌లో వెళ్లి లారీని ఢీకొన్న బైక్
- పిట్లం మండలంలో 161 జాతీయ రహదారిపై ఘటన

నవతెలంగాణ-పిట్లం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందిన ఘటన కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గడ్డె గుండు తండా సమీపంలో 161 జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌కొండ కథనం మేరకు నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి గ్రామానికి చెందిన సుబ్బరి రాజు (35), జలంధర్ గౌడ్ (38)లు శనివారం పిట్లం మండల కేంద్రానికి పనుల నిమిత్తం వచ్చి పనులు ముగించుకొని సాయంత్రం ఏడున్నర గంటల సమయంలో బైక్‌పై తిరుగు ప్రయాణం అయ్యారు. రాంగ్ రూట్‌లో వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న లారీని వేగంగా ఢీకొన్నారు. ఈ క్రమంలో బైక్ లారీ కిందకు దూసుకెళ్లడంతో ముందు టైర్ కింద ఒకరు ఇరుక్కుపోయారు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరినీ హుటాహుటిన మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో సుబ్బరి రాజు మృతి చెందగా, జలంధర్ గౌడ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అర్ధరాత్రి ఒంటిగంటకు మృతిచెందారు. ఇరువురి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.



మృతులు జలంధర్, రాజు(ఫైల్)



లారీ టైర్ కింద ఇరుక్కున్న రాజు

బైక్ నడిపే వారు హెల్మెట్ ధరించాలి

నవతెలంగాణ-సిరికొండ

ద్విచక్ర వాహనాలు నడిపి ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై నర్సింలు తెలిపారు. ఆదివారం రోజు హుస్సేన్ నగర్ గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వారం రోజుల క్రితం గడ్కోల్ గ్రామానికి చెందిన వ్యక్తి హెల్మెట్ లేకపోవడంతో ప్రమాదానికి గురై చనిపోయిన సంగతి ప్రతి వాహనదారుడికి తెలుసని, హెల్మెట్ ధరించినట్లయితే ప్రాణాలు నిలబడేవని, కావున ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేయాలని కోరారు. అదేవిధంగా వాహనాలకు సంబంధించిన లైసెన్సు, ఇన్సూరెన్స్ లు వాహనాల వెంబడి ఉంచుకోవాలని కోరారు. వీరి వెంట సిబ్బంది ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒక్కచోట చేరిన 1997-98 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-మెండోరా

తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల పాఠశాల (పోచంపాడ్) 1997-98 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు 1,60,000 (లక్ష అరవై వెయిలు) రూపాయలతో రెండు మంచి నీటి ట్యాంకులను నిర్మించారు. అనంతరం విద్యార్థులకు చదువు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అందులో భాగంగా వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఈ పాఠశాలలో చదివి 25 సంవత్సరాలు గడుస్తున్నా... గత సంస్కృతులను గుర్తుంచుకొని పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం అభినందనీయ మన్నారు. తాము చదువుకున్న పాఠశాలలో కలియతిరిగి తమ అనుబంధాలను స్మరించుకున్నారు.



నీళ్ల ట్యాంకులను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

బీఆర్ఎస్వీ నేతకు సునీల్‌రెడ్డి పరామర్శ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత శ్రీ కుమార్‌ను ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల శ్రీ కుమార్ వాళ్ళ నాన్న పురుషోత్తమ్ అనారోగ్యంతో మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ముత్యాల సునీల్ కుమార్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. మృతుడు పురుషోత్తం అనారోగ్యానికి గల కారణాలను శ్రీ కుమార్‌ని అడిగి తెలుసుకున్నారు. సునీల్ కుమార్ వెంట సునీల్ సేన సభ్యులు దూలూరి కిషన్‌గౌడ్, సాయి, తదితరులున్నారు.

మంచిప్పలో బోనాల పండుగ

నవతెలంగాణ-మోపాల్



మండలంలోని మంచిప్ప గ్రామంలో నల్ల పోచమ్మ తల్లి బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అన్ని కులాలు కలిపి 60బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందూరి సిద్ధార్థ, ఉప సర్పంచ్ జగదీష్, వీడీసీ ఛైర్మన్ నవీన్, గొల్ల శ్రీనివాస్ యాదవ్, వీడీసీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మోడీది మత రాజకీయం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పశ్య పద్మ

నవతెలంగాణ-ఆర్మూర్/కోటగిరి



మాట్లాడుతున్న కామ్రేడ్ పశ్య పద్మ

ఎన్నడూ చర్చిలకు వెళ్లనీ మోడీ ఓట్ల కోసం చర్చికి వెళ్లి.. మత రాజకీయం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పశ్య పద్మ అన్నారు. ఆదివారం పట్టణంలో రాజారాంనగర్ పద్మశాలి సంఘంలో సీపీఐ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ చేస్తున్న ప్రజా, రైతాంగ, కార్మిక విధానాలను నిరసిస్తూ ఈ నెల 14 నుంచి మే 15 వరకు సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు బీజేపీ హటావో దేశ్కో బచావో కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి సీపీఐ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పట్టణంలో, గ్రామాలలో విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. ఇతర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ యేతర పార్టీల ఆధ్వర్యంలో పాలనను సాగనీయకుండా ఎమ్మెల్యేల కొనుగోలు, ఈడీ, సీబీఐ దాడులు చేయడం దుర్మార్గమని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాల్సిన ప్రభుత్వాలు జీఎస్టీ పేరుతో దోచుకుంటున్నాయని అన్నారు. బీజేపీ విధానాలను నిరసిస్తూ మోడీని సాగనంపడం కోసం ప్రతిపక్షాలన్నీ ఐక్యమవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇంటింటికి ప్రచారంలో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వ్యక్తిగత దరఖాస్తులు తయారుచేసి సంబంధిత అధికారులకు పంపాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే భూమయ్య, జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, జిల్లా నాయకులు వై.ఓమయ్య, ఆరేపల్లి సాయిలు, సోమ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు హామీ ఏమైంది..?

ప్రభుత్వం పసుపు గిట్టుబాటు ధరను రూ.15000 ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చి గెలిచిన ఎంపీ అరవింద్ కేవలం రూ.6,500 తోటే మద్దతు ధర ప్రకటించి కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. అనంతరం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఆరేపల్లి సాయిలు, కార్యవర్గ సభ్యులు జిన్న సుమన్, మౌలాన, సాయిలు, షాదుల్, అలీమ్, కిష్టయ్య, గంగామణిని ఎన్నుకున్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరణ..

కోటగిరి : మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో బీజేపీ కో హటావ్ దేశ్ కో బచావ్ ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఏ.విఠల్‌గౌడ్ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా విఠల్‌గౌడ్ మాట్లాడుతూ.. అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాదులో ప్రారంభమైన ఇంటింటి సీపీఐ కార్యక్రమం పేరుతో ప్రజలను కలవాలని, మండలాల్లోని గ్రామాలలో గ్రామ పార్టీ ద్వారా ప్రజలలోకి వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నల్లగంగాధర్, బుడాల రాములు, ఇట్టే మారుతి, పి.బాలాగౌడ్, బాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ అవార్డులు పొందిన నలంద విద్యార్థులు



ఐఐటీ అవార్డులు పొందిన విద్యార్థులకు అభినందన

నవతెలంగాణ-ఆర్మూర్

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నలంద విద్యార్థులకు ఈ అభ్యాస అకాడమీ ఆధ్వర్యంలో అభ్యాసోత్సవం-2023, ఇంటర్ స్టేట్ అన్యువల్ అవార్డు ఫంక్షన్‌లో విద్యార్థులకు ముఖ్య అతిథుల సమక్షంలో అవార్డుల ప్రదానోత్సవం చేసినట్టు నలంద పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్ ఆదివారం తెలిపారు. ఈ సంవత్సరం ఒలంపియాడ్ సంబంధించిన టీసెట్, బిమటుకే సెట్ మెగా ఒలంపియాడ్ లెవెల్ 2 పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో తెలంగాణలో 12 జిల్లాలో 450మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో మొదటి మూడు రోజుల నుంచి విద్యార్థులకు రవీంద్ర భారతి ఆడిటోరియంలో జయప్రకాష్ నారాయణ ముఖ్యఅతిథిగా, మిగతా ముఖ్య అతిథుల సమక్షంలో విద్యార్థులకు అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. దీనిపై నలంద యాజమాన్యం పిల్లలకు ఒలంపియాడ్ ద్వారా సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ సిలబస్‌లో నిష్ణాతులు కావడానికి దోహదపడుతుందని, ఐఐటీ కాంపిటేటివ్ సిలబస్ ద్వారా ఇంటర్లో జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ పరీక్షలకు సన్నద్ధమవుతారని తెలిపారు. వచ్చే సంవత్సరం ఒలంపియాడ్, ఐఐటీ సిలబస్‌ను రెగ్యులర్ సిలబస్‌గా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. అవార్డు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, వారికి ఈ ర్యాంకులు రావడానికి కారణమైన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అభ్యాస్ ఫౌండర్ భువనగిరి ఫణి, అకాడమిక్ సీఈవో మణికంఠ ధన్యవాదాలు తెలిపారు.

ఏఐకేఎమ్ఎస్ రెండో మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మాణిక్‌బండార్ చెక్క వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభల పోస్టర్లను అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దు గంగాధర్ ఆదివారం ఆవిష్కరించారు. ఏప్రిల్ 25,26,27 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు పట్టణంలో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి నరసయ్య, నాయకులు లక్ష్మణ్, శివకుమార్, సుమన్, నవీన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు భవిత విద్యార్థి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఏడవ తరగతి ప్రవేశ పరీక్షకు జగదీష్ అనే వికలాంగ విద్యార్థి హాజరు కాగా మెట్లు ఎక్కలేక అవస్థ పడుతూ ఉండగా.. రెంజల్ సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, రెంజల్ సింగిల్ విండో చైర్మన్ ఈ బాలుడి అవస్థ చూడలేక పరీక్ష హాల్ వరకు తీసుకువెళ్లారు. గతంలో జగదీష్ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష అర్హత లభించినప్పటికీ, ప్రతిరోజు మెట్లు ఎక్కాలంటే కష్టం అవుతుందన్న ఉద్దేశంతో యాజమాన్యం నిరాకరించడంతో తిరిగి ఏడవ తరగతి ప్రవేశ పరీక్షకు ఆ విద్యార్థి హాజరయ్యాడు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్షలు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ ప్రవేశ పరీక్షకు 166 మంది విద్యార్థులు హాజరైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలను కల్పించినట్టు ఆయన పేర్కొన్నారు. పోలీసుల బందోబస్తుల మధ్య ఆరోగ్య కార్యకర్తల సమక్షంలో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని వారు పేర్కొన్నారు.

సత్యశోధక్ స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు అభినందన



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి

నవతెలంగాణ-సిరికొండ

భీంగల్ పట్టణంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత సర్జికల్ మెగా వైద్య శిబిరంలో సత్యశోధక్ పాఠశాల స్కౌట్స్, గైడ్స్ కలర్ పార్టీ విద్యార్థులను రాష్ట్ర రోడ్డు భవనాలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం అభినందించారు. విద్యార్థులకు స్కౌట్స్, గైడ్స్ ద్వారా క్రమశిక్షణ, సేవాభావం అలవడుతుందని, చిన్నప్పటి నుంచే వివిధ సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యం కావడం అలవరుచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి తెలంగాణ రాష్ట్రం తరపున కలర్ పార్టీకి ఎంపికై, జాతీయస్థాయి జాంబోరిలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మధుశేఖర్, స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె.సాల్మన్, స్కౌట్స్ మాస్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుని స్మారకార్థం క్రికెట్ టోర్నీ ప్రారంభం

నవతెలంగాణ-ధర్పల్లి



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న పలువురు

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తోట సుబ్బన్న విద్యుత్ షాక్‌తో మృతిచెందగా.. వారి స్మారకార్థం ఆదివారం గ్రామానికి చెందిన యువకులు ఆయన పేరున క్రికెట్ టోర్నీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్ల హన్మంత్‌రెడ్డి, సొసైటీ చెర్మన్ చెలిమేల మల్లికార్జున్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ శాఖ అధ్యక్షుని స్మారకార్థం టోర్నీ ఏర్పాటు చేసిన యువకులను అభినందించారు. అందరితో కలివిడిగా ఉండే తోట సుబ్బన్న మనందరి మధ్య లేకపోవడం బాధాకరమణి అన్నారు. అనంతరం టాస్ ఎగురవేసి అతను ప్రారంభించారు. ధర్పల్లి, గౌరారం జట్టు మొదట తలపడ్డాయి. టోర్నీలో మొత్తం 30 జట్లు పాల్గొంటున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

20న డబుల్ బెడ్ రూమ్‌ల కోసం నిరసన

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్



మాట్లాడుతున్న కార్యదర్శి మల్లేష్

నవతెలంగాణ-బోధన్

అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.10 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 20వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమంలో నిరుపేదలు అధిక సంఖ్యలో హాజరై నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ కోరారు. ఆదివారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్‌లను ఇవ్వాలని, సొంత ఖాళీ స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని, రేషన్ కార్డులకై దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్ కార్డులను ఇవ్వాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి 9సంవత్సరాలు పూర్తవుతున్నా.. బోధన్ పట్టణంలో ఏ ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూములు ఇవ్వలేదని, ఇల్లు లేని పేదలు సొంత ఇల్లు లేక కిరాయి ఇండ్లలో కిరాయి కట్టుకోవడానికి డబ్బులు లేక ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. కొంతమంది ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు కాపురాలు చేస్తూ ఇబ్బందుల పాలవుతున్నారని అటువంటి పేదలను గుర్తించి వారికి మాత్రమే డబుల్ బెడ్రూంలు ఇవ్వాలని, అదేవిధంగా సొంత స్థలం ఉన్న వారికి కేంద్ర ప్రభుత్వం ఐదు లక్షలు, రాష్ట్ర ప్రభుత్వము ఐదు లక్షలు ఇవ్వాలని అట్లాగే రేషన్ కార్డులకై దరఖాస్తులు చేసుకున్న వారికి వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోధన్ పట్టణంలో ర్యాలీ, ధర్నా కార్యక్రమం ఉంటుందని ఈ ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బోధన్ మండల కార్యదర్శి పడాల శంకర్, బి.నాగమణి, ఈర్షద్ పాషా, కే కుమార్, చంద్రశేఖర్, కళావతి, సుజాత, గౌర, పోశెట్టి, మధు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీసీసీబీ వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమేష్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రైతుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్‌తో కలిసి వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రేగుంట దేవేందర్ మాట్లాడుతూ.. రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే విషయంలో రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రైతు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2060, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2010 రైతులకు చెల్లిస్తున్నట్టు తెలిపారు. రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, డైరెక్టర్లు తీగల హరీష్, రెంజర్ల మహేందర్, మండల కో ఆప్షన్ సభ్యుడు అజ్మత్ హుస్సేన్, మాజీ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ సంత రాజేశ్వర్, రైతులు అవారీ గంగారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బద్దం రాజేష్ పాల్గొన్నారు.

కోటార్మూర్‌లో ఘనంగా ఊర పండుగ

నవతెలంగాణ-ఆర్మూర్

కోటార్మూర్‌లో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఊర పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలు చూపరులను అలరించాయి. స్థానిక కౌన్సిలర్లు పొద్దుటూరి మురళీధర్‌రెడ్డి, ఇట్టెడి నర్సారెడ్డి, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో రాజ్యాంగం

- బహుజన విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు యాట ప్రతాప్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు యాట ప్రతాప్

రాజ్యాంగం ప్రమాదంలో ఉందని బహుజన విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు యాట ప్రతాప్ అన్నారు. విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో బహుజన మహనీయుల జయంతి సందర్భంగా చలో నిజామాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పులాంగ్ చౌరస్తా నుంచి రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వరకు ర్యాలీని నిర్వహించారు.ముందుగా మహనీయులు గౌతమ బుద్ధుడు, జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే, అంబేద్కర్, కాన్షీరాం చిత్రపటాలకు పూలమాలతో సత్కరించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్.లింబాద్రి, విశిష్ట అతిథి తెలంగాణ యునివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పున్నయ్య, గౌరవ అతిథులు బీఎస్ఐ రాష్ట్ర నాయకులు అశోక్ భాగ్యవన్, జేఏహెచ్ నాయకులు షేక్ హుస్సేన్, సీనియర్ న్యాయవాది బాన రాజేశ్వర్, సీనియర్ న్యాయవాది ఆల్గోట్ రవీందర్, స్వేరోస్ జోనల్ కన్వీనర్ కలిగోట్ సాయి, వక్తలు బహుజన ఉద్యమ నాయకులు వీజీఆర్ నారగోని, బహుజన విద్యావంతుల వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ జిలకర శ్రీనివాస్ పాల్గొన్నారు. సభాధ్యక్షులు యాట ప్రతాప్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని అన్నారు. తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిది రాజ్యాంగమని కొందరు రాజకీయ నాయకులు వ్యాఖ్యలు చేస్తున్నారని గుర్తు చేశారు. తుఫాను వస్తే వాతావరణ శాఖ ముందుగా హెచ్చరికలు జారీ చేస్తుందని, అదే విధంగా రాజ్యాంగం అదే పరిస్థితిలో ఉందని, ముందు జాగ్రత్తలు తీసుకోకుంటే రానున్న రోజుల్లో బహుజనులు ఇబ్బందుల పాలు కావలసిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. అందుకే బహుజనులందరూ ఐక్యంగా ఏర్పడి రాజ్యాంగాన్ని పోరాటానికి ముందుకు సాగాలని రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. బహుజన ఐక్యవేదిక ట్రెజరర్ ఇబ్రహీం మాట్లాడుతూ.. బహుజన బిడ్డలపై దాడులు జరుగుతున్నాయని వారిని కాపాడాల్సిన బాధ్యత మన పైన ఉందని, అదేవిధంగా అంబేద్కర్, పేరియార్ సిద్ధాంతాలను గ్రామ, గ్రామాన అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.పున్నయ్య మాట్లాడుతూ.. 2001లో 11 మంది మేధావులతో తెలంగాణ ఉద్యమం నిజామాబాద్ నుంచే ప్రారంభమైందని అదే విధంగా బాహుజన విద్యావంతుల వేదిక ఇప్పుడు నిజామాబాద్ నుంచి ప్రారంభమైందని, భారతదేశం అంతాచేరి విజయవంతంతో లక్ష్యాన్ని చేరుకుంటుందని అన్నారు. ముఖ్య అతిథి, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్.లింబాద్రి మాట్లాడుతూ అంబేద్కర్ ఒక ప్రశ్న వెతుక్కుని ప్రయాణం చేశాడని, అదే నేడు రాజ్యాంగంగా రచించబడిందని, ఆయన విగ్రహాలు దేశంలోనే కాదు ప్రపంచ దేశాలలో కూడా ప్రత్యేకంగా కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రత్యేకమైన లైబ్రరీ ఏర్పాటు చేసి అక్కడ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. విద్యార్థులు అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవచ్చన్నారు. అంబేద్కర్ హక్కులను రాసి ఉండకపోతే మాట్లాడే హక్కు ఉండేది కాదని.. ఆర్టికల్ 3 లేకపోతే తెలంగాణ ఏర్పడేదీ కాదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్త్రీలకు రిజర్వేషన్ కల్పించడం ప్రతి గ్రామంలో ప్రతి చోట చర్చ జరగాలని అన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, మంజుల, కవిత బహుజన విద్యావంతుల వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తే
కేంద్రం తప్పకుండా ఆలోచిస్తుంది

- బ్రౌన్‌హైవే విస్తరణపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

బ్రౌన్ హైవే విస్తరణలో భాగంగా జిల్లా పరిధిలో గ్రామాలకు నష్టం జరగకుండా బైపాస్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తే కేంద్ర ప్రభుత్వం తప్పకుండా ఆలోచిస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఏమిచ్చిందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అడుగుతున్నాడని, స్వయంగా మంత్రి నియోజకవర్గంలో ఉన్న జాతీయ రహదారిని విస్తరించింది కేంద్రమేనన్న విషయాన్ని మరువద్దన్నారు. రాష్ట్ర రహదారులకు కేంద్రం వేల కోట్ల రూపాయలు ఇచ్చిందని తెలిపారు. ఒక సంవత్సరమే రోడ్ల కోసం 1000 కోట్లు ఇచ్చిన చరిత్ర ఎప్పుడు లేదన్నారు. వేల కోట్ల రూపాయల కేటాయించిన చరిత్ర మోడీ ప్రభుత్వానికి ఉందన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద కేంద్రం ఇచ్చిన నిధులతో తెలంగాణ రాష్ట్రంలో వేలాది కిలో మీటర్ల రోడ్ల విస్తరణ జరుగుతుందన్నారు. ఉపాధి హామీ కింద ఊరూరా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, హరితహారం, ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, పంచాయతీ భవనాలు, టాయిలెట్ సౌకర్యాలకు కేంద్రం పైసలు ఇస్తే పనులు జరిగిన విషయాన్ని మరువద్దన్నారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి తెలిసి తెలియక మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రైతులకు ఏకకాలంలో లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వని చరిత్ర రాష్ట్ర ప్రభుత్వానిది అన్నారు. పసుపునకు మార్కెట్లో ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద రూ.8500 ఇచ్చేందుకు అవకాశం ఉంద న్నారు. ఈ విషయమై కేంద్రానికి ఉత్తరం రాయాలని చెబితే రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు ధర ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉన్న రాజకీయాల కోసం రైతులను మోసం చేయడం సరికాదన్నారు. అదిలాబాద్, ఆర్మూర్ రైల్వే లైన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం సగం వాటా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ అడగ్గానే 2017 సంవత్సరంలో రూ.2700 కోట్ల ప్రాజెక్టును కేంద్రం మంజూరు చేసింది అన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు నవాతే రంజిత్ కుమార్, కిషన్ మోర్చా మండల అధ్యక్షులు నూకల మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకులు రెంజర్ల గంగారం, సింగిరెడ్డి ప్రతాపరెడ్డి, చింత హనుమంతు, చిలివేరి వినోద్, బూత్ అధ్యక్షులు ఎలిగేటి మహర్షి, వన్నెల దాస్ భాగ్యరాజ్, లాచర్ల రాజేందర్, ఎస్సీ సెల్ మండల కార్యదర్శి మీ దింటి సమ్మరావు, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు జిన్న రాజశేఖర్ పాల్గొన్నారు.

నీటి కోసం తంటాలు

- గడ్డపార చేతపట్టి పైప్‌లైన్ తవ్విన అంగన్‌వాడీ టీచర్, ఆయా

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని వడ్డేపల్లి అంగన్వాడీ కేంద్రానికి నీటి సౌకర్యం లేదు. గత ఆరు నెలలుగా మిషన్ భగీరథ నీరు, అలాగే గ్రామపంచాయతీ ద్వారా నీటి సౌకర్యం కల్పించాలని అంగన్వాడీ ఉపాధ్యాయురాలు దేవకుమారి మండల అధికారులకు, గ్రామపంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా.. నీటి సౌకర్యం కల్పించలేదు. విసుగుచెందిన ఆమె.. శనివారం ఆయమ్మ రాణి సాయంతో తానే స్వయంగా గడ్డపార చేతపట్టి పైప్‌లైన్ కనెక్షన్ కోసం తవ్వకం చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నల్లా కనెక్షన్ ఇచ్చి నీటి సౌకర్యం కల్పించాలని అంగన్‌వాడీ టీచర్ కోరుతుంది.



గడ్డపార చేతపట్టి తవ్వుతున్న అంగన్‌వాడీ టీచర్

నిజాంసాగర్ కెనాల్‌లో పడి బాలుడు మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నిజాంసాగర్ కెనాల్‌లో పడి బాలుడు మృతిచెందిన ఘటన 6వ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సాయికుమార్ వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో పెయింటర్స్ కాలనీకి చెందిన షేక్ సోహేల్ 17 తన మిత్రులతో కలిసి నిజాంసాగర్ కెనాల్ నందు స్నానం చేద్దామని వెళ్లాడు. ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రంజాన్ తోఫా అందజేత

నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్రంలోని ప్రతి పేదవారు తమ పండగను సంతోషంగా జరుపుకునేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ ముస్లిం మైనారిటీ లకు ప్రతి సంవత్సరం రంజాన్ తోఫా అందిస్తున్నారని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి అన్నారు. ఆదివారము మండల కేంద్రములోని మైనారిటీ ఫంక్షన్ హాల్ లో బట్టల పంపిణీ కార్యక్రమము నిర్వహించారు. కేసీఆర్ ఆశీర్వాదంతో రూరల్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్ ల ప్రత్యేక దృష్టి తో దర్పల్లి మండలం ఎంతో అభివృద్ధి సాధించిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా గోవన్నను భారీ మెజారిటీతో గెలిపించుకొని మంత్రిగా మన నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్, సొసైటీ చేర్మెన్ మల్లికార్జున్, మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, రాజపాల్ రెడ్డి, హమీద్, నజీర్ ఆహేమద్, లబ్దిదారులు , తదితరులు పాల్గొన్నారు.

పెంచమంటారు.. పట్టించుకోరు

- చేపల పెంపకంపై మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యం
- చెరువులు తవ్వి నష్టపోతున్న రైతులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్



చెరువు వద్ద బాధిత రైతు

ఇంటి పెరటిలో గాని, వ్యవసాయ సాగు భూముల్లో గాని చేపల పెంపకం చేపడితే లాభదాయకమని, చేప విత్తనం మొదలు మార్కెటింగ్ వరకు అంతా చూసుకుంటామని ప్రభుత్వం ఒక వైపు ప్రకటనలో గుప్పిస్తుంటే.. క్షేత్ర స్థాయిలో మత్స్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. చేపల పెంపకంపై ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తుండగా.. అందుకు విరుద్ధంగా అధికారుల తీరు ఉంటుందని విమర్శలు వ్యక్తమవు తున్నాయి. చేపల చెరువులు తవ్విన నాటి నుంచి అధికారులు వచ్చి పరిశీలించిన పాపాన పోలేదని, చేప విత్తనం కోసం మత్స్యశాఖ కార్యాలయం తిరిగి తిరిగి చెప్పులు అరిగినా విత్తనాలు మాత్రం అందజేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వారి తీరుతో కనీసం చేపల చెరువు తవ్వించేందుకు పెట్టిన పెట్టుబడులు సైతం తిరిగిరాని దుస్థితి నెలకొంది.

భూగర్భ జలాలు అధికంగా పెరగడం, సాగునీరు పుష్కలంగా లభిస్తుండటంతో రైతులు సాంప్రదాయ పంటలకు భిన్నంగా ఆక్వా సాగుకు మొగ్గు చూపాలని మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రచారం చేపట్టింది. వరి, వేరుశనగ, పత్తి వంటి పంటలను పక్కనబెట్టి చేపల పెంపకం సాగు చేయాలని సూచిస్తుండగా.. స్థానిక మత్స్యశాఖ అధికారులు అవేమి తమకు తెలియవంటూ చేతులెత్తుస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనలు, అధికారుల తీరు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు.

కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ పరిధిలోని నసురుల్లాబాద్ మండలం దుర్కి శివారులో సోమలింగేశ్వర ఆలయానికి వెళ్లే దారి పక్కన షాదుల్లా అనే రైతు తన వ్యవసాయ భూమిలో చేపల పెంపకం కోసం మూడు చెరువులను తవ్వించాడు. సాంప్రదాయ సాగుకు బదులు చేపలను పెంచడానికి చెరువులు తవ్వించాలని సూచించడంతో భూమిని చదును చేసి చేపల చెరువుగా మార్చాడు. చేపల చెరువుపై పూర్తిగా అవగాహన లేక ఎలాంటి చేప విత్తనాలు వేయ్యాలో తెలియక మత్స్య శాఖ అధికారుల చుట్టూ తిరిగిన ఎవరూ పట్టించుకోలేదని వాపోయాడు. చివరకు దళారులను నమ్మి ఒక రకమైన చేప విత్తనాలను వేయగా పెట్టిన పెట్టుబడి రాక అప్పుల పాలు అయ్యానని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.


అదే విధంగా కంపలగండిలో అమతం సాయగౌడు అనే వ్యవసాయ రైతు తన పంట పొలంలో రెండు చేపలను చెరువు తవ్వించాడు. పెట్టిన పెట్టుబడి రాక పోవడంతో నేడు చేపల చెరువులో చేపల వేయకపోవడంతో బీడుగా మారింది. చేపల పెంపకంపై అవగాహన కల్పించాల్సిన మత్స్యశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో నేడు చేపలు పెంచే రైతులు అప్పుల పాలవుతున్నారు.

చేపల పెంపకంపై సలహాలు, సూచనల కోసం మత్స్యశాఖ అధికారులను సంప్రదిస్తే చేపల పెంపకం కుదరదని అధికారులు అన్నట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయసాగు భూముల్లో గాను ఇంటి పెరటిలో చేపల పెంపకం ద్వారా ఇంటి పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండటంతో పాటు వాటిని చూస్తూ సేదతీరొచ్చునాని, చేపల పెంపకంలో కొన్ని యాజమాన్య పద్ధతులను చేపట్టడం ద్వారా మంచి దిగుబడులను పొందవచ్చు ఒక వైపు ఉన్నతాధికారులు సూచిస్తుంటే కింది స్థాయి సిబ్బంది పట్టించుకున్న పాపాన పోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఆర్గానిక్ ఫార్మింగ్ చేసేందుకు రకరకాల టెక్నాలజీలు అందుబాటులో ఉన్నాయి. కానీ రైతు ఇష్టపడి చేపల పెంపకంపై ఆసక్తి చూపి చెరువులు తవ్వుకున్నా అధికారులు మధ్య పెంపకంపై అవగాహన కల్పించకపోవడంతో మత్స్యశాఖపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కనీసం మత్స్యశాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతులకు కోరుతున్నారు.

పెట్టుబడి తిరిగిరాలే

షాదుల్లా సోమేశ్వర్.



దుర్కి శివారు భూమిలో ఉన్న మూడు ఎకరాల సాగు భూమిలో మూడు చెరువులను తవ్విన. మిగతా భూమిలో పామాయిల్ పంటను సాగు చేస్తున్న. లక్షలు పెట్టి చెరువులు తవ్వినా మత్స్యశాఖ అధికారుల సహకారం లేకపోవడంతో పూర్తిగా నష్టపోయా. చేప విత్తనం కోసం తిరిగినా పట్టించుకోలేదు. ప్రయివేటుగా కొంటే దిగుబడి రాలేదు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండలం మిర్జాపూర్ గ్రామంలో మిర్జాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు మారుతి పటేల్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు మారుతీ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎటు వంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు జరిపేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటోం దన్నారు. సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం విక్రయాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిర్జాపూర్, వీరపూర్ సర్పంచ్ లు పురం లక్ష్మి వెంకట రమణ, సాయిరాం, సొసైటీ డైరెక్టర్లు నీల నారాయణ, వేణుబాబు, మోహన్ రావు, రాంబాబు, దెల్లూరు హనుమాన్లు, ఎర్రోళ్ల లచావా, సంధ్యా నాయక్, అన్నారం సర్పంచ్ కృష్ణారెడ్డి, సీఈఓ జాకీర్ హుస్సేన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

రైతును రాజు చేయాలన్నదే కేసీఆర్ సంకల్పం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ, సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-నవీపేట్

రైతును రాజును చేయాలని దృఢ సంకల్పం తోనే కేసీఆర్ కంకణ బద్ధులై పనిచేస్తున్నారని ఎంపీపీ సంగెం శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు అన్నారు. మండలంలోని బినోల, నాలేశ్వర్, నిజాం పూర్, ఆశాజ్యోతి కాలనీ గ్రామాలలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు కేంద్రం ద్వారా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ధాన్యాన్ని రోడ్డు మీద కాకుండా చదునుగా ఉన్న స్థలాల్లో ఆరబెట్టి రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని కోరారు.

ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2060, బీగ్రేడ్ ధాన్యానికి రూ.2040 ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. కావున ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పితాంబర్, ఉప సర్పంచ్ పోశెట్టి, లక్ష్మణ్, పెద్దన్న ఎంపీటీసీ శ్యామల, బుచ్చన్న, రమేష్, డైరెక్టర్లు విజయ్, అంజయ్య, గౌడ్ గంగాధర్, రైతులు సంజీవ్, భీమ రెడ్డి, భోజరెడ్డి ఏఈఓ అపూర్వ పాల్గొన్నారు.

ఇండ్లు, ఉద్యోగాలు లేవ్..

- పేదలు, నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ ఆటలు
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ విమర్శ

నవతెలంగాణ-భిక్కనూర్



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ



కార్యకర్తల, నాయకుల భారీ ర్యాలీ

సీఎం కేసీఆర్ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ విమర్శించారు. ఎంతోమంది యువకులు, ఉద్యోగాలు లేక ఆత్మహత్యలు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇప్పటివరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించలేదని ధ్వజమెత్తారు. అన్ని రకాల ధరలను పెంచుతూ పేద మధ్యతరగతి కుటుంబాలతో చెలగాటం ఆడుతున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు సీఎం కేసీఆర్ కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఆదివారం మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో హత్ సే హత్ జోడో యాత్రలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంతకుముందు 44వ జాతీయ రహదారి నుండి గ్రామం వరకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, వీరభద్ర కళ్యాణమండపంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నా బలమని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ కుటుంబం దోచుక తింటుందని ఆరోపించారు. ఎన్నికల్లో సమీపిస్తున్నం దున ప్రతి కార్యకర్త ప్రజల సమస్యలు తెలుసుకోవ లసిన అవసరం ఎంతైనా ఉందని, వరంగల్లో రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో దళితులకు కరెంట్ బిల్లులు మాఫీ చేశామని, ప్రస్తుతం కరెంటు బిల్లులు దౌర్జన్యంగా వసూలు చేస్తున్నారని, రుణమాఫీ చేయకుండా రైతులను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని చెప్పి విద్యార్థులను మోసం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ అందజేస్తామని, ప్రాజెక్టుల పేరుతో కోట్లాది రూపాయలు సీఎం కేసీఆర్ కుటుంబం దోచుక తింటుందని, గత నాలుగు సంవత్సరాలుగా డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ కార్మికుల జీవితాలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నరని, బీడి పరిశ్రమను రద్దు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. దళిత గిరిజనులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని చెప్పి కేసీఆర్ వారిని మోసం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమ్ రెడ్డి, జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షులు కుంట లింగారెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షులు నరేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, ఎంపీటీసీ సభ్యులు మోహన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బాగా రెడ్డి, సురేందర్ రెడ్డి, యాదగౌడ్, నర్సింగ్ రావు, తిరుమల స్వామి, కిరణ్ కుమార్, సాజిద్, స్వామి, నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళం



విరాళం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి లైన్ ఇన్స్పెక్టర్ రూ.5118 , విద్యుత్ ఏఈ రామలక్ష్మి 2118, తిప్పాపూర్ లైన్ మెన్ రావు సింగ్ 2118 రూపాయల విరాళాన్ని ఆదివారం ఆలయ చైర్మన్ సిద్ధరాములుకు అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన వారిని శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దాయారి సాయిరెడ్డి, సర్పంచ్ స్వామి,బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో సప్త ప్రారంభం



ప్రారంభమైన సప్త

నవతెలంగాణ-జుక్కల్

బసవ జయంతి పురస్కరించుకొని మండలంలోని బస్వాపూర్ గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో సప్తహం ఆదివారం సర్పంచ్ రవి పటేల్ ప్రారంభించారు. ఏడు రోజుల పాటు గ్రామ శివారులోని అతి పురాతనమైన బసవన్న మందిరంలో నిత్య అన్నదానంతో పాటు రోజువారి పూజ, భజన, కీర్తనలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సర్పంచ్ తెలిపారు. గ్రామస్తుల సహకారంతో యువకులు పాల్గొని కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్, గ్రామ పెద్దలు శివరాజ్ పటేల్, బస్వరాజ్ పటేల్ , మనోహర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు రిలే దీక్షలు



మాట్లాడుతున్న హన్మండ్లు

నవతెలంగాణ-మద్నూర్

పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మద్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు హన్మండ్లు మాట్లాడుతూ మద్నూర్‌లో హాస్టల్‌లో ఉంటూ 10వ తరగతి వరకు చదువుకున్నా అని చెప్తున్న హన్మంత్ షిండే.. మూడు సార్లు ఎమ్మెల్యే అయినా మద్నూర్‌ను అభివృద్ధి చేయడం లేదని ఆరోపించారు. మూడో రోజులో దీక్షలో సుల్తాన్‌పేట్ నుంచి నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

ధాన్యం సేకరణపై అవగాహన



తేమశాతంపై అవగాహన కల్పిస్తున్న అధికారి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

తేమ శాతం, ఇతర నాణ్యతా ప్రమాణాలు, రవాణా సౌకర్యం తదితరాల అంశాలపై రైతులకు బీర్కూర్ వ్యవసాయ శాఖ ఎఇఓ శ్రావణ్ కుమార్ అవగాహన కల్పించారు. ఆదివారం బీర్కూర్ మండల కేంద్రంలోని పలు ధాన్యం కల్లాల వద్దకు వెళ్లి తేమ శాతం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. అదే విధంగా రైతులు తాము పండించిన ధాన్యానికి సంబంధించిన తేమ శాతం 17శాతానికి మించి ఉండొద్దని రైతులకు వివరించారు. వీరి వెంట రైతులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రమాదవశాత్తు పూరిగుడిసె దగ్ధమై సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కంచర్ల ఎంపీటీసీ మోహన్‌రెడ్డి కోరారు. ఆదివారం ఇక్కడ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు భిక్కనూర్ పట్టణంలో, మల్లుపల్లి గ్రామంలో గుడిసెలు, ఇల్లు దగ్ధమై రెండు కుటుంబాలు సర్వస్వం కోల్పోయినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకొని ఇల్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆస్పత్రి ఘటన బంగారు తెలంగాణకు నిదర్శనమా..?

నవతెలంగాణ-రామారెడ్డి

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను, బంగారు తెలంగాణ చేస్తానని మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం, నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఘటన బంగారు తెలంగాణకు నిదర్శనమా? అని జడ్పీ ఫ్లోర్‌లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ప్రజలు వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రులను అత్యధికంగా వినియోగించుకుంటున్నారని సభలు, సమావేశాల్లో ఊదరగొడుతున్న ప్రజాప్రతినిధులు, ఓ మహానుభావులారా, నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ఘటనపై పెదవిప్పి మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఇంత దారుణమైన పరిస్థితి పేద ప్రజలకు రావడం సిగ్గుపడాల్సిన విషయమని, ఇకనైనా గొప్పలు చెప్పుకోవడం మాని, చేతులతో చేసి చూయించాలని హితవు పలికారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఘటన తీవ్రంగా కలిచివేసిందని, ప్రజలకు కనీస వసతులు కల్పించకపోవడం దారుణమని మండిపడ్డారు.

న్యూహాలాండ్ ట్రాక్టర్ షోరూం ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ట్రాక్టర్ షోరూం ప్రారంభించి కీ అందజేత

నిజామాబాద్ నగరంలోని హైదరాబాద్ రోడ్డులో న్యూ హాలాండ్ ట్రాక్టర్ షోరూంను న్యూ హాలాండ్ ట్రాక్టర్ రీజినల్ మేనేజర్ వి.అరవింద్ కుమార్, మెనెజింగ్ డైరెక్టర్ నల్ల దినేష్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్‌డీ నల్ల దినేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలో 30 హెచ్‌పీ-120 ట్రాక్టర్స్ 2వీల్ డ్రైవ్, 4 విల్ డ్రైవ్ అత్యాధునిక టెక్నాలజీతో కలిగిన ట్రాక్టర్లను, ప్రస్తుత దేశం, రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న వ్యవసాయ రంగానికి అనుగుణంగా నిజామబాద్ పరిసర ప్రాంత రైతులకు అత్యాధునికమైన టెక్నాలజీ గల న్యూ హెూలాండ్ ట్రాక్టర్ షోరూంని అందుబాటులో తెచ్చినందుకు ఆనందంగా ఉందని తెలిపారు. షోరూం ప్రారంభవోత్సవంలో మొదటి రెండు ట్రాక్టర్లను మేత్రి విట్టల్ డోంగ్లి, దోంప్రేవార్ లక్ష్మణ్ బిచ్కుందకు నల్ల దినేష్‌రెడ్డి తాళంచెవిలు అందచేశారు. కార్యక్రమంలో సీఈఓ నల్ల ప్రతిహాస్‌రెడ్డి, ఏరియా మేనేజర్ నవీన్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పశువైద్య కళాశాలను ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న వేల్పూర్ భూమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలో పశువైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లిలోని ఎన్ఆర్ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు నాయక్‌వాడి నరసయ్య, వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. 8 లక్షల గొర్రెలు, లక్షా 30వేల మేకలు, 1,40,000 ఆవులు, మూడు లక్షల బర్రెలు, ఈ జిల్లాలో ఉన్నాయని అన్నారు. వాటి సంరక్షణకు గాను జిల్లాలో పశు వైద్య కళాశాలను (వెటర్నరీ కాలేజీ)ని ఏర్పాటు చేస్తే జిల్లా రైతులకు చాలా ఉపయోగపడుతుందని అన్నారు. గతంలో ప్రభుత్వాలు పశు వైద్య కళాశాల ఏర్పాటు కొరకు ప్రయత్నించినా అది సఫలం కాలేదని, తెలంగాణ ప్రభుత్వం ఈ వైద్య కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని వేల్పూర్ భూమయ్య అన్నారు. జిల్లా మంత్రి, శాసనసభ్యులు చొరవ తీసుకుని జిల్లాలో వెటర్నరీ కాలేజీను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, గౌరవ అధ్యక్షులు నాయక్‌వాడి నరసయ్య, ఉపాధ్యక్షులు అగ్గు ఎర్రన్న, బి.సాయిలు, సహాయ కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, డి.బస్సీ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కబ్జా అరికట్టాలి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మున్సిపాలిటీ పరిధిలోని 17వ డివిజన్‌లోని రాజీవ్‌నగర్ కాలనీలో వెంచర్‌లోని పార్క్ స్థలం కబ్జాకు గురవుతుందని, అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. 19 ప్లాట్లు, బీటీ రోడ్డుతో అభివృద్ధి చెసిన వెంచర్‌లోని ఓపెన్ ప్లేస్ పార్క్ ఏరియాను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధపడుతున్నారని, కావున అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. ఇది వరకే వినతిపత్రం అందజేశామని, సర్వే చేపట్టి పార్క్ స్థలాన్ని కాపాడాలని కాలనీకి చెందిన అఖిల్ కుమార్, సాంబ శివ రావు, కె.రాజా మల్లు, ఎ.జ్యోతి, శంకర్ తదితరులు కోరుతున్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబెట్టొద్దు

- రైతులకు ఎస్సై శంకర్ సూచన

నవతెలంగాణ-లింగంపేట్

వరి కోతలు ప్రారంభం కావడంతో రైతులు తామ పండించిన ధాన్యాన్ని రహదారులపై ఆరబోయొద్దని ఎస్ఐ శంకర్ సూచించారు. రోడ్డుపై ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోపోతున్నారని తెలిపారు. రైతులు ధాన్యం రోడ్డుపై కాకుండా రోడ్డు పక్కన పోసి కుప్పలుగా వేసి రాత్రి వేళలో నల్లటి కవర్ వేయడంతో ధాన్యం కుప్పలు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారి మూలమలుపుల వద్ద ధాన్యాన్ని ఆరబోయొద్దన్నారు. ధాన్యం రోడ్డుపై పోసి ప్రమాదం జరిగినట్లయితే అందుకు రైతే బాధ్యత వహించాలని ఇప్పటికే మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ సర్పంచులకు రైతులకు సూచించినట్టు తెలిపారు.

మహిళలకు ఆర్థిక భరోసా..
'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్'

- సద్వినియోగం చేసుకోవాలంటున్న పోస్టల్ అధికారులు

నవతెలంగాణ-బోధన్

మహిళలకు ఆర్థిక భరోసా ఇచ్చే విధంగా తపాల శాఖలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ మహిళలకు, యువతులతో పాటు గృహిణులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఒక్కసారి రూ.వెయ్యి నుంచి గరిష్టంగా రెండు లక్షల వరకు డిపాజిట్ చేస్తే రెండు సంవత్సరాలకు ప్రభుత్వం 7.5శాతం వడ్డీని చెల్లిస్తుంది. ప్రతి మహిళ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సాలూర బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

మహిళలు, ఆడపిల్లలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన కొత్త పథకం మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్ అని తపాల శాఖ అధికారులు పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలు, మైనర్ ఆడపిల్లల పేరు మీద సంరక్షకులు ఈ ఖాతాను ప్రారంభించవచ్చు. ఈ ఖాతాను కనిష్ఠంగా రూ.1,000తో పాటు గరిష్టంగా రూ.2,00,000 వరకు జమ చేయవచ్చు.



గరిష్ఠ విలువ దాటకుండా ప్రతి 3నెలల వ్యవధితో ఎన్ని ఖాతాలైన ప్రారంభించవచ్చు.

అత్యధిక వడ్డీరేటు ప్రత్యేకం..

ఈ పథకంలో మహిళలు పొదుపు చేసే డబ్బులపై అత్యధిక వడ్డీ రేటు అందించడం ఈ పథకం ప్రత్యేకం. మహిళలు పొదుపు చేసిన డబ్బులపై 7.5శాతం వడ్డీ ప్రతి సంవత్సరం లభిస్తుంది. ఖాతా కాలవ్యవధి 2 సంవత్సరాలు. జమ అయిన మొత్తంలో ఒక సంవత్సరం తరువాత 40శాతం వరకు పాక్షికంగా ఉపసంహరణ చేసుకొనే సౌకర్యం కలదు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా 6 నెలల తరువాత 5.5శాతం వడ్డీతో ఖాతాను ఎప్పుడైన ముగించుకునే వెసులుబాటు ఉంది.

వడ్డీ వివరాలు.. రూ.1000 జమచేస్తే 7.5శాతం వడ్డీ ప్రకారం రెండు సంవత్సరాలకు రూ.160 వడ్డీ లభిస్తుంది. దాంతో మొత్తం రూ.1,160 అందిస్తారు. అలాగే ఒక లక్ష రూపాయలు జమ చేస్తే 7.5 శాతం వడ్డీ ప్రకారం రెండు సంవత్సరాలకు రూ.16,022 అందిస్తారు. రెండు లక్షలు జమ చేస్తే 7.5 వడ్డీ శాతం ప్రకారం 2 సంవత్సరాలకు రూ.32,044 అందిస్తారు.

కావలసిన పత్రాలు.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ ప్రవేశం కోసం ఆధార్‌కార్డ్, పాన్‌కార్డ్, 3 ఫోటోలు అందించాలి. అలాగే మరిన్ని వివరాలకు మీ దగ్గరలోని హెడ్ పోస్టాఫీసు/సబ్ పోస్టాఫీసు, బ్రాంచ్ పోస్టాఫీసులలో ఎక్కడైనా ఈ ఖాతాను ప్రారంభించవచ్చు.

ఉచిత వైద్య శిబిరం


చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ముప్కాల్

సుశ్రుత పిల్లల ఆసుపత్రి ఆర్మూర్ ఆధ్వర్యంలో ముప్కాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుశ్రుత పిల్లల ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జైడి గణేష్‌రెడ్డి, డాక్టర్ మౌనికరెడ్డి సమక్షంలో 16 సంవత్సరాలలోపు పిల్లలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పిల్లలకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ ఉచిత వైద్య సేవలను అందించిన సుశ్రుత పిల్లల ఆసుపత్రి వైద్యులకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సుశ్రుత పిల్లల ఆసుపత్రి సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యుత్ లైన్‌మెన్ మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న కాట్రోత్ మంగళ్ చందు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కామారెడ్డి జిల్లాలోని గాంధారి మండలం వెంకటాపూర్ తాండకు చెందిన ఈయన విధుల్లో భాగంగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి కింద పడడంతో వెన్నుముక విరిగింది. చికిత్స కోసం హైదరాబాద్ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. 40 రోజుల నుంచి చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి ఆదివారం మరణించాడు. అందరితో కలువుగోలుగా ఉండే మంగళ్ చంద్ మృతి పట్ల విద్యుత్ శాఖ అధికారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన బార్ అసోసియేషన్



జిల్లా జడ్జిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామపంచాయతీలో ఆదివారం అగ్రి లీగల్ ఎయిడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత, జిల్లా లీగల్ ఎయిడ్ సెక్రటరీ, న్యాయమూర్తి పద్మావతి, పట్టణ కోర్టు జడ్జిలు నసీం సుల్తానా, జడ్జి దీప్తి వేముల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్నారెడ్డి అధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి జైడి మదుసుదన్‌రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి తుమ్మ సుకేష్, మహిళా రెప్రిసెంటెటివ్ సవిత చక్ర, మండల లీగల్ ఎయిడ్ సెక్రెటరీలు ఆనంద్, పవన్, అడిషనల్ పీపీ రమేష్, న్యాయవాది రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత రైతుకూలీ సంఘం మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్

ఏప్రిల్ 25,26,27 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం రెండవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం ఏఐకేఎంఎస్ నాయకులు బోధన్ పట్టణంలోని కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోధన్ ఉమ్మడి మండల అధ్యక్ష, కార్యదర్శులు దార్ల భూమన్న, గంపల పోశేట్టి మాట్లాడుతూ భువనగిరి జిల్లా ఆలేరులో జరిగే రైతు కూలీ సంఘం రాష్ట్ర 2వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహసభ లో మొదటి రోజు ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. 26, 27తేదీలలో ప్రతినిధుల సభ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో బోధన్ మండల ఉపాధ్యక్షుడు దేవదాసు, నాయకులు షేక్ నజీర్, గంగారాం, సాయిలు, నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

24న ఔరంగాబాద్‌లో బీఆర్ఎస్ మహాసభ

నవతెలంగాణ-బోధన్

బీఆర్ఎస్ పార్టీ జాతీయ స్థాయిలో విస్తరణలో భాగంగా మహారాష్ట్రలో నిర్వహిస్తున్న మూడవ భారీ బహిరంగసభ ఈ నెల 24వ తేదీన ఔరంగబాద్‌లో నిర్వహిస్తున్న నేపథ్యంలో మహారాష్ట్రలోని ఛత్రపతి శంబాజినగర్ జిల్లా (ఔరంగాబాద్)లో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమెర్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కలిసి మహారాష్ట్ర నాయకులతో సభ ఏర్పాట్లపై ఆదివారం చర్చించారు. ఈ సమావేశంలో ఐడీసీ చైర్మన్ వేణుగోపాల్ చారి, మహారాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు మానిక్ కదం, హర్షవర్దన్ జాదవ్ (మాజీ ఎమ్మెల్యే), అభయ్ పాటిల్, ఖదీర్, మౌలానా బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటా

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆర్యవైశ్య నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త తెలియజేశారు. ఆదివారం నిజామాబాద్ నగరంలోని ఆర్యనగర్‌లో ఆర్యవైశ్య సంఘం నూతన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలో ఆర్యవైశ్యుల ఉన్నతికి సహకరిస్తానన్నారు. నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. ఇప్పటివరకు నిజామాబాద్ నగరంలో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఆర్యవైశ్యుల్లో ఎంతోమంది నిరుపేదలు నలిగిపోతున్నారని తెలిపారు. వారిని బయటకు తీసుకొచ్చి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. నిరుపేద ఆడపిల్లల పెండ్లిళ్లకు ధన్‌పాల్ లక్ష్మీబాయి విట్టల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సూరన్న పెళ్లి కానుక పేరిట ఉచితంగా పుస్తే మట్టెలు, దుస్తులు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు కొండ వీరశేఖర్, మాణిక్ భవన్ అధ్యక్షుడు ధన్‌పాల్ శ్రీనివాస్, యువజన అధ్యక్షులు ఇల్లెందుల ప్రభాకర్, ఆర్యనగర్ అధ్యక్షులు చిట్టిమిల్ల రాజామౌళి, చిట్టిమిల్ల హరిప్రసాద్, లిఖిత్, మహంకాళి విజయ్, కుకుట్ల నవీన్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి అడ్‌హక్ కమిటీ


సమావేశంలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో అర్బన్ కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించి పార్టీ అభివృద్ధి కొరకు అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా కోయేడి నర్సింలును నియమించారు. కో కన్వీనర్‌గా ప్రతాప్‌రెడ్డి, లవంగ రాజు, శంకర్ ముదిరాజ్, అంబిక సత్యనారాయణ, కల్లెడ గంగాధర్, ఫిరోజ్, అశోక్, లక్ష్మి యాదవ్, నావతే నర్సయ్య, నారాగౌడ్‌ను నియమించారు. నగరంలో క్షేత్రస్థాయిలో పర్యటించి పార్టీ అభివృద్ధి కొరకు పనిచేయాలని కోరారు. త్వరలో ప్రతి డివిజన్లో కమిటీలు ఏర్పాటు చేస్తామని అన్నారు. పదవులపై ఆశపడకుండా ప్రతి ఒక్కరూ కార్యకర్తలా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, కల్లెడ గంగాధర్, అంబిక సత్యనారాయణ, శంకర్ ముదిరాజ్, లక్ష్మి యాదవ్, రఫీక్, ఫిరోజ్, నర్సయ్య, రామకృష్ణ, షబ్బీర్, గంగాధర్, విశ్వనాథ, అశోక్, రవి, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలం, ఇల్లు నిర్మించి ఇవ్వాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఖాళీ స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న ఆర్డీవో కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ భవన్ కోటగల్లిలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇల్లు లేని వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించి ఇస్తానని గొప్పలు చెప్పాడన్నారు. ప్రభుత్వ చిత్తశుద్ధి లోపంతో ఈ పథకం అటకెక్కిందన్నారు. గతంలో గృహ నిర్మాణాల కోసం ప్రత్యేకించి గృహ నిర్మాణ శాఖ ఉండేదన్నారు. కేసీఆర్ సర్కారు ఆ శాఖనే ఎత్తివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించాలని ప్రజాపంథా పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. నగరంలో, చుట్టుపక్కల గ్రామాల్లో చిన్నాచితక పనులు చేసుకుంటున్న పేదలు చాలీచాలని ఆదాయంతో తక్కువ అద్దెకు ఇరుకు గదుల్లో అనేక అవస్థలు పడుతూ రోజులు వెళ్ళదీస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఓడబ్ల్యు జిల్లా ప్రధానకార్యదర్శి కే.సంధ్యారాణి, పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, నగర అధ్యక్షులు అశుర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు లక్ష్మి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

'పారాక్వాట్' గడ్డి మందు హానికరమైంది

- సూచించిన వైద్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రైతులు పంట పొలాల్లో వాడే పారాక్వాట్ అనే గడ్డి మందు చాలా హానికరమైనదని పలువురు వైద్యులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో జనరల్ ఫిజీషియన్ వైద్యుల సదస్సును నిజామాబాదులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాల గురించి ప్రస్తావించారు. చాలామంది ఆత్మహత్య ప్రయత్నం కొరకు పారాక్వాట్ అనే గడ్డి మందు తీసుకోవడం వల్ల ప్రాణాలు పోతున్నాయని, ఇది కేవలం ఒక మూత తీసుకోవడం వలన ప్రాణం పోతుందని, ఎటువంటి చికిత్సను అందించలేమని, దీనివలన ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాకుండా ప్రైవేట్ ఆస్పత్రిలో కూడా చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని కాబట్టి ప్రజలలో పారాక్వాట్ అనే గడ్డి మందుపై అవగాహన కల్పించి అనర్థాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన వైద్యులపై ఎంతో ఉందని అన్నారు. ఈ సదస్సులో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పలువురు

సీపీఎస్‌ను రద్దుచేయాలి

- పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సీపీఎస్‌ను రద్దుచేసి ఓ.పి.ఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ఇరు ప్రభుత్వాలను కోరుతూ జిల్లా కేంద్రంలోని స్థానిక కంఠేశ్వర్ నుంచి ధర్నా చౌక్‌వరకు టి.ఎస్.సి.పి.ఎస్.ఈ.యు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పెన్షన్ కాన్సిట్యూషన్ మార్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా టి.ఎస్.సి.పి.ఎస్.ఈ.యు ఆరోగ్య విభాగ రాష్ట్ర సహాధ్యక్షులు డాక్టర్ కిరణ్ మాదల, పి.ఆర్.టి.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. టీఎస్‌సీపీఎస్ఈయుూ గత పోరాటాల ఫలితంగానే గ్రాట్యూటీ ఫ్యామిలీ పెన్షన్ సాధించారని తెలిపారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ దారులకు న్యాయం చేకూర్చే దిశగా ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తాము చేస్తున్న నిరసనలను ఇరు ప్రభుత్వాలు గుర్తించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి విక్రం సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవల్ల గోపాల్, రాములు, ప్రవీణ్ కుమార్, టీఎస్‌టీయూఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న దృశ్యం

బహుజన మహాసభ రాష్ట్ర కమిటీ సభ్యులుగా కాంబ్లే మధు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీల ఉమ్మడి ఐక్య వేదికగా ఏర్పడిన బహుజన మహాసభకు రాష్ట్ర కమిటీ సభ్యులుగా నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కాంబ్లే మధు ఎన్నిక అయ్యారు. ఈనెల ఏప్రిల్ 15న హైదరాబాద్‌లోని బీసీ సాధికారత రాష్ట్ర కార్యాలయంలో జరిగిన వివిధ జిల్లాల ప్రతినిధుల సమావేశంలో బహుజన మహాసభ రాష్ట్ర తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి సామాజిక విశ్లేషకులు సాదు మాల్యాద్రి, బహుజన లెఫ్ట్ పార్టీ-బీఎల్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, బహుజన కమ్యూనిస్టు పార్టీ-బీసీపీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బహుజన లెఫ్ట్ పార్టీ-బీఎల్‌పీ, బహుజన కమ్యూనిస్టు పార్టీ- బీసీపీలకు ఉమ్మడి ప్రజా సంఘంగా బహుజన మహాసభ రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు.



రాష్ట్ర కన్వీనర్‌గా నల్గొండ జిల్లాకు చెందిన ఎర్ర జాన్సన్, కోకన్వీనర్‌లుగా ముద్రకోల ఆంజనేయులు సిరిసిల్ల జిల్లా, ఎం.ఎం.గౌడ్ సూర్యాపేట జిల్లా, కేశవులు మహబూబ్ నగర్ జిల్లా రాష్ట్ర కమిటీ సలహాదారులుగా దండి వెంకట్, కె.పర్వతాలు, సిద్దిరాములు, గాజుల శ్రీనివాస్, తోకల సంజీవ్‌తో పాటు 33 మూడు జిల్లాలకు ప్రాతినిధ్యం వహించే విధంగా తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ లతా దేవరాజు ఆదివారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రూ.ఐదు లక్షలు నిధులు మంజూరు చేయడంతో పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లతా దేవరాజ్, ఎంపీటీసీ పోతే రాజు, మాజీ సర్పంచ్ శ్రీపతి శేఖర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బైరి లక్ష్మణ్, వీడీసీ అధ్యక్షులు కొప్పు రాజేందర్, బీఆర్ఎస్ నాయకుడు దామల క్రాంతి, అశోక్, రాజేశ్వర్, నవీన్, కిషన్, అశోక్, శ్రీరాములు, గంగాధర్, సాయన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న సర్పంచ్

అగ్నిమాపక సేవలపై అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక సేవల శాఖ అగ్నిమాపక వారోత్సవాలను ఏప్రిల్ 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నామని జిల్లా అగ్నిమాపక అధికారి నర్సింగ్ రావు తెలిపారు. అందులో భాగంగా ఆదివారం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో అగ్నిమాపక సేవలపై ప్రజలకు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించినట్టు తెలిపారు. వైద్య సిబ్బంది, నర్సులకు, ప్రజలకు ఫైర్ డ్రిల్ ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ గురించి వారికి క్లుప్తంగా తెలియజేశారు. అమృత లక్ష్మీ హాస్పిటల్ సిబ్బందితోపాటు, స్థానిక ప్రజలకు జిల్లా అగ్నిమాపక అధికారి పి.నర్సింగ్‌రావు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో లీడ్ ఫైర్‌మాన్ తిరుపతి, ఫైర్‌మాన్ సుధాకర్, ఆశిష్ కుమార్, హనుమాన్ చారి, హస్సన్ చార్లీ, వారిస్ హైమద్ తదితరులు పాల్గొన్నారు.


సేవలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జార్జిరెడ్డి బాటలో నడుస్తాం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జార్జిరెడ్డి బాటలో నడుస్తామని పి.డి.ఎస్.యూ నాయకులు తెలిపారు. పీడీఎస్‌యూ వ్యవస్థాపకులు కామ్రేడ్ జార్జిరెడ్డి 51వ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలోని సాయినగర్‌లో పి.డి.ఎస్.యూ బాల బృందం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. "జీనా హైతో మర్నే సిఖో కదం కదం పర్ లడ్నా సిఖో" అనే నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. అనంతరం యువ బృందం నాయకుడు యువ మాట్లాడుతూ జార్జిరెడ్డిని ఆదర్శంగా తీసుకొని చదువులో ముందుంటామని, ఉద్యమ భావాలను చిన్నతనం నుండే అలవర్చుకుంటామని, జార్జ్ బాటలో నడుస్తామని అన్నారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ బాల బృందం సభ్యులు ధ్రువ, రిషి, వేదాంత, బన్నీ, యశ్వంత్, దీక్షిత తదితరులు పాల్గొన్నారు.